ప్రజాశక్తి

శుక్రవారం 1 డిసెంబర్ 2023

5

విజయనగరం



భూ పట్టాలు పంపిణీ

ప్రజాశక్తిగీవిజయనగరం టౌన్

ప్రభుత్వం అందిస్తున్న పట్టాలతో లబ్ధిదారులు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షను వ్యక్తం చేశారు. గురువారం తాహశీల్దార్ కార్యాలయంలో 95 మంది లబ్ధిదారులకు 90.98 ఎకరాల భూపట్టాలను పంపిణీ చేశారు.అసైన్డ్ ల్యాండ్స్ ఫ్రీ హోల్డ్ రైట్స్ పేరిట పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ భూ పట్టాలను అందజేస్తున్నా మన్నారు. ఈ పట్టాలతో జిరాయితీ భూముల మాదిరిగానే వినియోగించు కోవచ్చని చెప్పారు. డి పట్టా భూములను క్రమబద్ధీకరణ చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం జగన్మోహన్ రెడ్డి చేసి చూపించారని అన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, మండల పరిషత్ అధ్యక్షులు మామిడి అప్పలనాయుడు, జడ్పిటిసి కెల్ల శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, తహశీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా అడుగు(ర)జాడ?

మహాకవి గురజాడను విస్మరించిన అధికారులు, పాలకులు

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

గురజాడ... పేరు వినగానే ప్రపంచం ఫరిడవిల్లుతుంది. ఆయన అభ్యుదయ సమాజానికి దిక్సూచి. అందుకే సాహితీవేత్తలు, సాహితీ ప్రియులు మొదలుకుని సమాజ హితం కోరుకునే అభ్యుదయవాదులంతా ఆయన కవితలు, కథలు, కావ్యాలను గుర్తు చేస్తుంటారు. ఆయన బాటలో నడవాలని హితబోధ చేస్తుంటారు. బహుశా అందుకేనేమో విజయనగరం పేరు చెప్పగానే చాలా మంది నోటి ప్రతిధ్వనించేది గురజాపేరే. కానీ, ఆయన జాడను అనుసరించే పాలకులు, అధికారులు మన జిల్లాలో కరువయ్యారు. ఏటా గురజాడ జయంతి, వర్ధంతి ప్రాధాన్యత తగ్గిపోతుండగా, ఈ ఏడాది ఏకంగా ఆయన వర్ధంతి రోజున స్మరించుకునేవారే కరువయ్యారు. కనీసం గురజాడ చిత్రపటం, విగ్రహాలకు దండవేసి, ఆశయాలను పదిమందికి పంచే తీరిక లేకుండా పోయింది.



దేశమును ప్రేమించుమన్నా... మంచి అన్నది పెంచుమన్న అన్నాడు మహాకవి గురజాడ. దేశమంటే మట్టికాదోయ్...దేశమంటే మనుషులోయ్... అంటూ విశ్వమానవాళికి కనువిప్పు కలిగించాడు. వొట్టిమాటలు కట్టిపెట్టి గట్టిమేల్ తలపెట్టవోయ్ అంటూ ఉద్బోధించాడు. ఇలా ఒకటా రెండా పుత్తడి బొమ్మ పూర్ణమ్మ అనే నాటక రచనతో నాటి కన్యాశుల్కం తదితర సాంఘిక దూరాచారాలను చెండాడు. ఎల్లలోకములెల్ల ఒక ఇళ్లై... వర్ణభేదములెల్ల అంటూ ప్రపంచమంతా ఒక్కటిగా ఉండాలని చాటి చెప్పాడు. ఇలా ఉంటే మతములన్నియు మాసిపోవును జ్ఞానమొక్కటె మిగిలిపోవును అని ఎంతో దూర దృష్టితో సమాజాన్ని మొల్కొల్పిన సంఘసంస్కర్త. ఈ నేపథ్యంలో గురజాడ ఘనకీర్తి ఎల్లలు దాటిందనడంలో సందేహం లేదు. ఎప్పుడో 19, 20 దశకాల్లో ఆయన రాసిన గేయాలు సజీవంగా, సమాజానికి ఎంతో ఉపయోగపడే విధంగా ఉన్నాయంటే సమాజం పట్ల ఆయనకున్న ముందు చూపు ఎంతో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇంతటి మహాకవి గురజాడ వెంకట అప్పారావు తన సాహిత్య ప్రస్థానమంతా ఇక్కడి నుంచే సాగడంతో ఒకరకంగా చెప్పాలంటే విజయనగరం ప్రత్యేకతగానే చెప్పుకోవచ్చు. అందువల్లే గురజాడ పేరున అనేక కళా, సాహిత్య, విద్యాసంస్థలు ఏర్పడ్డాయి. అంతే కాకుండా ఆయన జయంతి, వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ ఆధ్వర్యాన సాహిత్యపోటీలు, సాహితీ సభలు నిర్వహించేవారు. గురజాడ దార్శినికతను జొప్పించేందుకు విద్యార్థులకు వ్యాసరచనపోటీలు కూడా నిర్వహించి, ప్రోత్సాహకాలు అందజేయం ఒకప్పుడు ఆనవాయితీగా ఉండేది. ఈ క్రమంలోనే ఏటా వర్ధంతి రోజు నవంబర్ 30న గురజాడ సాహిత్యాన్ని జనంలోకి తీసుకెళ్లే కవులు, సాహితీవేత్తలకు ప్రభుత్వం తరపున గురజాడ సాహితీ పురస్కారం అందజేసేవారు. ఇది ఒకప్పటి మాట. కొన్నేళ్లుగా గురజాడ వర్ధంతి, జయంతి మొక్కుబడిగానూ, సాహితీ పురస్కారం అలంకార ప్రాయంగాను మూరుతున్నాయి. జగమంతా కలిసివుండాలనే మహాకవి గురజాడ భావజాలానికి భిన్నంగా మతఛాందసత్వాన్ని, కట్టుబాట్ల పేరిట స్త్రీ అణిచివేతను బలంగా జనాల్లోకి తీసుకెళ్లే ఓ వ్యక్తికి నగరానికి చెందిన గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఏకంగా పురస్కారం అందజేయడం వివాదంగానే మారింది. ఈ ఏడాది ఏకంగా అధికారులు, ప్రజాప్రతినిధులకు వర్ధంతి నిర్వహించే తీరిక లేకుండా పోయింది. ఏటా కలెక్టర్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా సాగుతున్నా ఈ ఏడాది విస్మరించారు. ఇందులో ప్రజాప్రతినిధులు పాల్గొనే సంప్రదాయం ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ ఎన్నికల రాజకీయాలతో పూర్తిగా మర్చిపోయారు. ఇటీవల కాలంలో సామాజిక న్యాయం అంటూ గొంతు ఎండి పోతున్నట్టు ప్రసంగాలు గుప్పిస్తున్న ప్రజాప్రతినిధులు.... ఇప్పటికైనా ఒట్టిమాటలు కట్టిపెట్టి...గట్టిమేల్ తలపెట్టవోయ్ అన్న గురజాడ స్ఫూర్తిని ఆచరించి, భావితరాలకు అందిస్తారని ఆశిద్దాం.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు నాగార్జున

హక్కులను కాలరాస్తున్నారు : టిడిపి

ప్రజాశక్తి–గరివిడి

వైసిపి పాలనలో ప్రజల హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని టిడిపి విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. చంద్రబాబు పరిపాలిస్తే సమాజం అంతా బాగుంటుందని విజయనగరం జిల్లా టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. గురువారం స్థానిక సినిమా హాల్ సెంటర్‌లో 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారంటీ ' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ గతంలో చంద్రబాబు పాలనలో అన్ని వర్గాలకూ మేలు జరిగిందని, సమాజాన్ని ముందుకు తీసుకు వెళ్లడంపైనే విజన్ ఉండేదని గుర్తు చేశారు. వివిధ కార్పోరేషన్లు పెట్టి నిధులు విడుదల చేసి వారి అభ్యున్నతికి తోడ్పడే వారని గుర్తు చేశారు. ప్రస్తుత జగన్ పాలన అంతా విధ్వంసమే అని విమర్శించారు. అధికారం ఇచ్చిన తర్వాత ఆయన మైండ్ సెట్ ఎలాంటిదో ఈ నాలుగున్నరేళ్లలో అంతా చూశారని తెలిపారు. వ్యవస్థన్నా.. అందులో ఉండే మనుషులన్నా గౌరవం లేదన్నారు. ప్రజాస్వామ్యంలోని నిబంధనలన్నీ తుంగలో తొక్కారని విమర్శించారు. వివిధ కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని, నిధులను దారి మళ్లించారని తెలిపారు. రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబు రావాలని అన్నారు. కార్యక్రమంలో సారేపాక సురేష్ బాబు, రెడ్డి గోవింద, యజ్జిపరపు సత్యం, కుమిలి శ్రీను,తూట శ్రీను, గొట్టిముక్కల సత్తిరాజు,వైగాల సత్యం, దుక్క రామకష్ణ, బాబీ,బొడ్డేపల్లి ప్రసన్న కుమార్,పద్మ, పాపి నాయుడు, సూరప్పడు, అప్పలనాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకకార్యదర్శి దివాన్ మైదీన్

నేటి నుంచి మెగా డ్రైవ్

- అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ఇళ్ల నిర్మాణానికి ముందుకు రానివారి పట్టాలు రద్దు
- హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి దివాన్ మైదీన్

ప్రజాశక్తి–విజయనగరం

పేదలందరికీ ఇళ్ల పథకం కింద గృహ నిర్మాణాలు పూర్తి చేయడానికి డిసెంబర్ 1 నుండి మెగా కంప్లిషన్ డ్రైవ్ నిర్వహించాలని హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి దివాన్ మైదీన్ తెలిపారు. రాష్ట్రం లో ఈ అక్టోబర్‌లో 5.8 లక్షల గృహాలను పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు జరిపామని, వచ్చే జనవరి లోపల మరో 5 లక్షల గహాలను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా నిర్ణయించారని తెలిపారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మండల ప్రత్యేకాధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, మండలాభివృద్ధి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ నాగలక్ష్మితో కలసి మండల వారీగా లక్ష్యాలపై సమీక్షించారు. మెగా డ్రైవ్ కోసం మండల వారీగా కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 36 వేల గృహాలను పూర్తి చేశామని, మెగా మేళా లో డిసెంబర్, జనవరి రెండు నెలల్లో 16 వేల గృహాలను పూర్తి చేయాలని తెలిపారు. లబ్ధిదారులను చైతన్య పరచి టైం లైన్‌లో పూర్తి చేయడం వేగంగా జరగాలన్నారు. లే అవుట్లలో పూర్తి మౌలిక సదుపాయాలను , సోక్ పిట్లను పూర్తి చేయాలన్నారు. బిల్డింగ్ మెటీరియల్ సరఫరా చేసేవారి తోను, కాంట్రాక్టర్ లతోను, మండల స్థాయి అధికారులతోను వెంటనే సమావేశాలు ఏర్పాటు చేసుకొని కార్యాచరణ తయారు చేసుకోవాల న్నారు. ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాని వారికీ నోటీసు లు జారీ చేయాలని, ఇళ్ల పట్టా రద్దు చేయడమే కాకుండా ఇప్పటివరకు ఇచ్చిన రుణాన్ని కూడా తిరిగి చెల్లించవలసి ఉంటుందని లబ్దిదారునికి చెప్పాలని అన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేసి వచ్చే ఫిబ్రవరి లో సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని తెలిపారు. వచ్చే 2రోజుల్లో మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని, డిసెంబర్ 10లోపల సచివాలయ స్థాయిలో సమావేశం పూర్తి చేయాలని తెలిపారు. మండల ప్రత్యేకాదికారులు, ఎంపిడిఒలు దీనిపై అత్యంత శ్రద్ధ చూపాలని తెలిపారు. సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు ఇఇలు, డిఇలు, పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్‌లు పాల్గొన్నారు.

హామీలను శతశాతం అమలు చేశాం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

దుప్పాడలో సచివాలయం, వైఎస్ఆర్ విలేజ్ క్లీనిక్ ప్రారంభం

ప్రజాశక్తి–విజయనగరంటౌన్

శతశాతం హామీలను అమలు చేయడం ద్వారా, ప్రజలకు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి నిలబెట్టుకున్నారని రాష్ట్ర శాసనసభ డిప్యుటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కొనియాడారు. అన్ని వర్గాల అభ్యున్నతే ముఖ్యమంత్రి ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. మండలంలోని దుప్పాడ గ్రామంలో కొత్తగా నిర్మించిన సచివాలయం, వైఎస్ఆర్ విలేజ్ క్లీనిక్ భవనాలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కోలగట్ల మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు వచ్చే జనవరి నుంచి అవ్వా తాతలకు ఇచ్చే పెన్షన్ రూ.3వేలకు పెరుగుతోందని చెప్పారు. పట్టణంలో ప్రధాన రోడ్లను విస్తరించి, లైటింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేశామని, జంక్షన్లను అభివద్ధి చేశామని చెప్పారు. సుదీర్ఘ కాలంగా విజయనగరం ప్రాంత ప్రజలు అశోక్ గజపతిరాజుకు అధికారాన్ని ఇచ్చినప్పటికీ, ఆయన ఈ ప్రాంతానికి గాని, ఈ జిల్లా గానీ చెప్పుకోదగ్గ పని ఒకటి కూడా లేదని విమర్శించారు. దుప్పాడ గ్రామంలో చేపట్టిన అభివద్ధి కార్యక్రమాలను వివరించారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేస్తూ రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అవినీతి రహితంగా అందుతున్నాయన్నారు. ఒక్క దుప్పాడ గ్రామంలోనే వివిధ సంక్షేమ కార్యక్రమాల క్రింద సుమారు రూ.22 కోట్ల నగదును నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకి జమ చేశారని తెలిపారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ అధ్యక్షులు కెవి సూర్యనారాయణ రాజు, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి కెల్ల శ్రీనివాసరావు, ఎంఎసి చైర్మన్ నడిపేన శశి భార్గవి, జొన్నవలస పిఎసిఎస్ అధ్యక్షులు కెల్ల త్రినాధ్, ఎంపిటిసి కెల్ల కృష్ణవేణి, దుప్పాడ సర్పంచ్ కరుమజ్జి లక్ష్మి, కరుమజ్జ రాములప్పడు, ఎంపిడిఒ గంటా వెంకటరావు, వైసిపి నాయకులు, మండలంలో గల ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్, జెడ్‌పి చైర్మన్

ప్రొఫెసర్ శాంతమ్మకు ఇస్పా అవార్డు

ప్రజాశక్తి – నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఎమిరేటస్ ప్రొఫెసర్‌గా పనిచేస్తొన్న చిలుకూరి శాంతమ్మకు చెన్నైకి చెందిన ఇండియన్ స్పెక్ట్రో ఫిజిక్స్ అసోసియేషన్ (ఇస్పా)అవార్డును అందజేసింది. గురువారం విశ్వవిద్యాలయంలో ఇస్పా ఫౌండర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఎస్.గుణశేఖరన్, ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు చేతుల మీదుగా ఈ అవార్డును బహూకరించారు. ఈ సందర్భంగా ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ శాంతమ్మ తమకు రోల్ మోడల్‌గా నిలిచారన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడే తత్వంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరచుకుంటే వృద్ధిలోకి రాగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ ఎస్.గుణశేఖరన్ మాట్లాడుతూ శాంతమ్మకు ఈ అవార్డును అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రొఫెసర్ శాంతమ్మ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో స్పెక్ట్రో స్కోపీ ప్రయోగశాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఛాన్సలర్ స్పందిస్తూ రూ.10 కోట్లతో ఒక ప్రాజెక్టుకు ప్రతిపాదించామని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ప్రజలు, పోలీసుల మధ్య మైత్రీ భావం

- ఎస్‌పి ఎం.దీపికా పాటిల్
- కొండ లింగాలవలసలో ఉచిత వైద్య శిబిరం
- గిరిజనులకు బట్టలు, యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి–మెంటాడ

ప్రజలు, పోలీసులకు మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పేందుకు పోలీసు శాఖ పలు కార్యక్రమాలు చేపడుతోందని జిల్లా ఎస్‌పి ఎం.దీపికా పాటిల్ అన్నారు. అందులో భాగంగానే మెగా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గురువారం మండలంలోని కొండలింగాలవలస పంచాయతీ శివారు సవరవల్లిలో తిరుమల–మెడికవర్, రోటరీ క్లబ్ సహకారంతో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఎస్‌పి మాట్లాడుతూ గిరిజనులకు అండగా నిలిచేందుకు కమ్యూనిటీ పోలీసింగులో భాగంగా మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి అవసరమైతే శస్త్ర చికిత్సలు కూడా ఉచితంగా చేస్తారని తెలిపారు. తమ పిల్లల చదువుపట్ల గిరిజనులు ప్రత్యేక శ్రద్ధ వహించి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దాలని కోరారు.

రోటరీ అధ్యక్షులు డాక్టర్ కృష్ణశాంతి మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ఎవరికి వారు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, ఆధునిక వైద్యం అందుబాటులో ఉన్నందున ప్రాథమిక స్థాయిలోనే ఆరోగ్య సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన వైద్య సహాయాన్ని పొందాలని అన్నారు. బొబ్బిలి డిఎస్పీ పి. శ్రీధర్ మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. గజపతినగరం సిఐ లెంక అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ మెగా వైద్య శిబిరం నిర్వహణతో కొండ లింగాలవలస గ్రామంతోపాటు చుట్టు ప్రక్కలగల మరో 14 గ్రామాలకు చెందిన గిరిజనులు చికిత్స పొందే వెసులుబాటు కలిగిందన్నారు.



గిరిజన మహిళలకు బట్టలు పంపిణీ చేస్తున్న ఎస్‌పి ఎం.దీపిక

అనంతరం, ఎస్‌పి గ్రామంలోగల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ను సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించారు. బాగా చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించాలని అభిలషించారు. ఈ సందర్భంగా కొందరు విద్యార్థుల ఆసక్తులను ఎస్‌పి అడిగి తెలుసుకోగా ఒక విద్యార్థిని బి.సీత పోలీసు అవుతానని, మరో విద్యార్థి పి.రాజు లాయర్ అవుతానని చెప్పగా వారిని ఎస్‌పి అభినందించారు. ఉద్యోగాలు వచ్చినంత వరకు చదవాలని, మధ్యలో చదువు ఆపేయవద్దని సూచించారు. అనంతరం గిరిజన మహిళలకు చీరలు, పురుషులకు దుప్పట్లు, యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆంధ్ర ఎస్ఐ సిద్ధార్ధ కుమార్, బొండపల్లి ఎస్ఐ రవి, మానాపురం ఎస్ఐ శిరీష, స్థానిక సర్పంచ్ పాడి వరహాలమ్మ, మాజీ సర్పంచ్ ఎస్ నాగమణి, ఎంపిటిసి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మహాకవి గురజాడకు నివాళి

ప్రజాశక్తి–విజయనగరం కోట

మహాకవి గురజాడ అప్పారావు 108వ వర్ధంతి సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులు గురువారం ఘనంగా నివాళులర్పించారు. గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ముందుగా కవులు, కళాకారులు, పట్టణ ప్రముఖులు మహాకవి స్వగృహంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం గురజాడ వాడిన వస్తువులతో స్వగహం నుంచి గురజాడ కాంస్య విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. మహాకవి రాసిన దేశభక్తి గేయాలను విద్యార్థులు ఆలపించారు. గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో గురజాడ సాంస్కతిక సమాఖ్య అధ్యక్షులు పివి నర్సింహరాజు, ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్, కోశాధికారి డాక్టర్ ఎ.గోపాలరావు మాట్లాడుతూ గురజాడ వర్ధంతి సందర్భంగా ప్రతి ఏటా ప్రముఖులకు గురజాడ విశిష్ట పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా డిసెంబర్ 3న ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్‌కు గురజాడ విశిష్ట పురస్కార ప్రదానం చేస్తామని తెలిపారు. ఆనందగజపతి కళాక్షేత్రంలో సాయంత్రం 6గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గప్రసాద్, పురస్కార ప్రదాత కోలగట్ల వీరభద్ర స్వామి, చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో గురజాడ కుటుంబ సభ్యులు వెంకటేశ్వరప్రసాద్, ఇందిర, లలిత, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రొంగలి పోతన్న, డాక్టర్ జక్కు రామకష్ణ, సాలూరు సంతోషి, అల్లంశెట్టి శ్రీనివాసరావు, లోగిశ లక్ష్మునాయుడు, ఈపు విజయకుమార్, మానాప్రగడ సాహితి, రత్నాల బాలకష్ణ, సూర్యలక్ష్మి, స్వరూప, హిమబిందు తదితర కవులు, కళాకారులు, ప్రముఖులతోపాటు శ్రీ త్యాగరాజ సంగీత నత్య కళానికేతన్, గురజాడ, సన్ స్కూల్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గురజాడ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆయన వారసులు, సాహితీవేత్తలు

ఐద్వా ఆధ్వర్యాన...

విజయనగరం టౌన్ : మహాకవి గురజాడ వెంకట అప్పారావు వర్ధంతి కార్యక్రమాన్ని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఎల్‌బిజి నగర్, జిసిసి సోప్ యూనిట్, ముచ్చువాని చెరువుగట్టు వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పి . రమణమ్మ, ఉపాధ్యక్షులు వి లక్ష్మి , సిఐటియు జిల్లా కార్యదర్శి జగన్మోహన్‌రావు మాట్లాడుతూ దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుష లోయ్ అని గర్జించిన నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు అన్నారు. బ్రిటిష్ కాలం నాడే కన్యాశుల్కాన్ని , బాల్యవివాహాలను తన రచనల ద్వారా వ్యతిరేకించారని, వితంతు వివాహాలను దగ్గరుండి జరిపించారన్నారు. మహిళలకు ఇంటిపని , వంట పని నుంచి విముక్తి కల్పించి, ఆస్తి హక్కు కల్పించిన నాడే సమానత్వం సౌభ్రాతత్వం వస్తుందని అన్నారు. కానీ పాలకులు నూతన జాతీయ విద్యా విధానం ద్వారా మహిళలను చదువు నుంచి దూరం చేస్తున్నారని, ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లతో రాత్రి పగలు వెట్టిచాకిరి చేయిస్తున్నారని, పనికి తగ్గ ప్రతిఫలం దక్కడం లేదని అన్నారు. అందుకే గురజాడ స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుమారి, లక్ష్మమ్మ, వెంకటలక్ష్మి రాజులమ్మ ,ఈశ్వరమ్మ, సుజాత ,లక్ష్మి ,రమణమ్మ, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

రైలు యాత్రను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి–విజయనగరం కోట

భారత గౌరవ యాత్ర రైలును సద్వినియోగం చేసుకోవాలని ఐ ఆర్‌సిటిసి ఏరియా ఆఫీసర్ చంద్ర మోహన్ బిస్వా కోరారు. గురువారం విజయనగరం రైల్వే స్టేషన్‌లో భారత్ గౌరవ రైలుయాత్ర కు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 9న గౌరవ యాత్ర పేరుతో ట్రైన్ బయలు దేరుతుందన్నారు. ఈ ట్రైన్ సికింద్రాబాద్‌లో బయలుదేరి పెందుర్తి మీదుగా రాత్రి 12.15గంటలకు విజయనగరం చేరుకుంటుం దన్నారు. రైలు విశాఖ స్టేషన్‌కు వెళ్లదన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన పూరీ, గయ, వారణాసి, అయోధ్య, ప్రయోగ దర్శనాలు ఉంటాయన్నారు. ఈ యాత్రలో ప్రయాణం చేసే వారికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రికి టిఫిన్స్ ఐఆర్‌టిసి కల్పిస్తుందన్నారు స్టేషన్ నుంచి ఏ ప్రదేశాలకు చేరుకోవాలన్న ప్రయాణికులు ఎసి లేదా నాన్ ఎసి ఏది బుక్ చేసుకుంటే అది బస్సుల్లో తీసుకువెళ్తామన్నారు. ఒకవేళ రాత్రికి స్టే చేయవలసి వస్తే రూమ్‌లు కేటాయిస్తామన్నారు. ఎటువంటి మెడికల్ ఎమర్జెన్సీ అయినా ఐఆర్‌టిసి సిబ్బంది దగ్గరుండి చూసుకుంటారని తెలిపారు. ఇతర వివరాలకు చందన్ కుమార్ 8287932318, సాయిప్రసాద్ 9281495847, విశాలాక్షి 9701085461 సంప్రదించాలని కోరారు కార్యక్రమంలో టికెట్ ఇన్‌స్పెక్టర్ పి.ఈశ్వరరావు, జనరల్ బుకింగ్ అధికారి డి. శ్రీనివాసరావు, ఐఆర్‌టిసి సిబ్బంది పాల్గొన్నారు.

తుపాను హెచ్చరికతో రైతులు ఆందోళన

వేపాడ : మండలంలోని వరి పంట కోసిన రైతులు తుపాను హెచ్చరికతో ఆందోళన చెందుతున్నారు. కోసిన పంటను పంట పొలాల్లోనే ఉంచడం వల్ల ఎప్పుడు వర్షం పడి పంట పోతుందోనని భయపడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు చేరడం వల్ల పంట నష్టపోయింది. దీంతో వరి మొత్తం పొలంలోనే ఉండిపోయింది. చేతికందే వరి వర్షాలు పడితే తడిచి నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గురువారం చాలా మంది రైతులు పొలాల్లో కుప్పలు పెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు.

రూ.158.75 కోట్లతో నగర పాలక సంస్థ బడ్జెట్‌కు

స్టాండింగ్ కమిటీ ఆమోదం

ప్రజాశకి–విజయనగరం టౌన్

డిప్యూటీ స్పీకర్, శాసనసభ్యులు వీరభద్రస్వామి, కౌన్సిల్ సభ్యుల సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి దిశగా పయనింపజేసేందుకు కృషి చేస్తున్నామని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. గురువారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో 2024–25 వార్షిక బడ్జెట్ 158.75 కోట్ల రూపాయలతో పొందుపరిచిన అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. బడ్జెట్లో కేటాయించిన నిధులను నగరాభివృద్ధికి శతశాతం ఖర్చు చేసే విధంగా ప్రయత్నిస్తామని ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ పేర్కొన్నారు. ముందుగా బడ్జెట్లో పొందుపరిచిన అంశాలపై చర్చించారు. రూ.81 కోట్లను నగరాభివృద్ధికి కేటాయించారు. రూ.12 కోట్లతో రోడ్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు 12 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు, కోటి రూపాయలతో సచివాలయ భవన నిర్మాణానికి, రెండు కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి, కోటి 50లక్షలతో పట్టణ సుందరీకరణకు, 6కోట్లతో మురుగు కాలువలు, కల్వర్టుల నిర్మాణానికి, కోటి 50 లక్షలతో సెంట్రల్ లైటింగ్, జంక్షన్ లైటింగ్, కోటి 50 లక్షలతో వివిధ పార్కులలో క్రీడా సామాగ్రి అమర్చేందుకు, రూ.80 లక్షలతో సామాజిక మరుగుదొడ్లు ఏర్పాటు, రూ.2.50కోట్ల నిధులతో నీటి సరఫరా కోసం పైప్ లైన్లు ఏర్పాటు, గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో గుర్తించిన పనులు 6 కోట్ల రూపాయలతో చేపట్టేందుకు నిర్ణయించారు. ఈ సందర్భంగా మేయరు విజయలక్ష్మి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో నగరంలో ఎన్నడూ లేని విధంగా అభివద్ధి కొనసాగుతుందన్నారు. ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్ మాట్లాడుతూ ఖర్చులతో పాటు ఆదాయ మార్గాలను కూడా మెరుగుపరచు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కమిషనర్ ఆర్ శ్రీరాములనాయుడు మాట్లాడుతూ నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్ 150 కోట్ల పైబడి అధిగమించడం సంతోషంగా ఉందన్నారు. మొండి బకాయిలు శతశాతం వసూలు చేసేందుకు డిసెంబర్ వరకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పట్నాన పైడిరాజు, బోనాల ధనలక్ష్మి, పిన్నింటి కళావతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

గుషినిలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ..

నెల్లిమర్ల: మండలంలోని గుషినిలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పివివి సూర్య నారాయణ రాజు గురువారం ప్రారంభించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన వెల్‌నెస్ సెంటర్, గుషిణి నుండి అలుగోలు వరకు వేసిన బి.టి.రోడ్డును వారి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చి మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. వైసిపికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ళ సుధారాణి, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీరాములు నాయుడు, డిసిసిబి వైస్ చైర్మన్ చనమల్ల వెంకట రమణ, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాస రావు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ జమ్ము అప్పల నాయుడు, ఎంపిటిసి చనమల్ల స్వాతి పాల్గొన్నారు.

వికలాంగులకు పరికరాలు పంపిణీ


ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న జెడ్‌పి ఛైర్మన్

చీపురుపల్లి: వికలాంగులకు వివిధ రకాలైన పరికరాలను జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఛైర్మన్ పాల్గొని వివిధ అంగవైకల్యం కలిగిన 51 మందికి మోటార్ ట్రై సైకిళ్లు, వీల్ ఛైర్లు, ట్రైసైకిళ్లు, చెవిటి మిషన్లు, చేతి కర్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులై ఉండి పరికరాలు అందని వారు డిశంబరు 5వ తేదీన కొత్తవలస మండలం మంగళంపల్లిలో గల గురుదేవ్ ఛారిటబుల్ ట్రస్ట్‌కి వెళ్లి పేరు నమోదు చేసుకోవాలన్నారు. వికలాంగులు చెప్పేటప్పుడు ఆధార్ కార్డు, సదరన్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా తీసుకొని వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఎంపిడిఒ జి గిరిబాల, తహశీల్దార్ ఎం సురేష్, ఎఒ తామరాపల్లి ప్రవీణ్, ఇఒపిఆర్‌డి అన్నపూర్ణాదేవి, వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, కోరుకొండ దాలయ్య, చందక గురునాయుడు, ముజీకిర్ అహ్మద్ పాల్గొన్నారు.

రాగి పంట సాగుకు ముందుకు రావాలి

బొబ్బిలి: రబీలో రాగి పంట సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ కోరారు. గొల్లపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో రాగి పంట సాగు చేయాలన్నారు. రాగి పంటతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చునన్నారు. రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారీలకు ధాన్యం అమ్మకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పుణ్యవతి, రైతులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఇంటి పన్నులు వసూలు

డెంకాడ: ఆన్‌లైన్‌లోనే ఇంటి పన్నులు వసూలు చేస్తున్నామని పినతాడివాడ సచివాలయ కార్యదర్శి ఎం జగదీష్ తెలిపారు. ఇంటి పన్ను బకాయిలను నగదు రూపంలో కాకుండా ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా ఇంటి పన్నులు చెల్లిస్తున్నట్లు ఆయన గురువారం వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా చేయడంతో పని సులభతరమవడంతో పాటు నగదు నేరుగా పంచాయతీ ఖాతాలో జమవుతుందని తెలిపారు. ప్రజలందరూ ఇంటి పన్ను బకాయిలను ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలని కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

నెల్లిమర్ల: సతివాడ ఎపి మోడల్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న బి. రాంజీ నవంబరు 23–25 తేదీలలో జరిగిన అండర్–17 వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో బంగారు పతకాన్ని సాధించి జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపాల్ జె. పద్మలత, ఉపాధ్యాయ సిబ్బంది గురువారం అభినందించారు.

సారిపల్లి విద్యార్థికి బంగారు పతకం

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో సారిపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎన్ యశ్వంత్ పాల్గొని బంగారు పతకం లభించింది. చిత్తూరు జిల్లా చౌడపల్లిలో నవంబరు 24 నుంచి 26 వరకు జరిగిన ఎపిఎస్ జిఎఫ్ గేమ్స్ అండర్ 17 కేటగిరిలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో విజయనగరం జిల్లా టీం తరుపున పాల్గొని బంగారు పతకం సాధించినట్లు హెచ్‌ఎం పి. పద్మావతి తెలిపారు. తనకు శిక్షణ అందించిన పీడీ మోహన రావుని యశ్వంత్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సిబ్బంది గురువారం అభినందించారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన

వేపాడ: మండలంలో జాకేరు సచివాలయంలో సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు ఆధ్వర్యంలో గురువారం ధాన్యం కొనుగోలుపై సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ అవగాహన కల్పించారు. ఒక్కో రకం ధాన్యం ధరను రైతులకు వివరించారు. రైతులు పండించే రాగులను కూడా జాకేరు కొనుగోలు కేంద్రంలో కొనుగోలు చేస్తామని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ అవకాశాన్ని గ్రామంలో గల రైతులందరూ వినియోగించుకోవాలని సమావేశంలో సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు తెలిపారు.

పశువుల అక్రమ తరలింపు పట్టివేత

బొబ్బిలి: పార్వతీపురం నుంచి విజయనగరం వైపు అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు గురువారం పట్టుకున్నారు. పార్వతీపురం సంతలో పశువులను కొనుగోలు చేసి వ్యాన్‌లలో విజయనగరం వైపు అక్రమంగా తరలిస్తుండగా రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న శ్రీఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో పోలీసులు తనిఖీ చేసి తొమ్మిది వాహనాలను పట్టుకున్నారు. వాహనాలను సీజ్ చేసి 84 పశువులను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ పశువుల తరలింపుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సిహెచ్ సత్యనారాయణ చెప్పారు.

హత్యాయత్నం కేసులో పదేళ్లు జైలు

జామి: జామి పోలీసు స్టేషన్ పరిధిలోని జామి గ్రామంలో 2022 సంవత్సరంలో నమోదైన హత్యాయత్నం కేసులో నిందితుడు శంబంగి వెంకటరామ్ ప్రసాద్‌కు 10 సంవత్సరాలు జైలు శిక్ష, రూ. 6 వేలు జరిమానా విధిస్తూ విజయనగరం 5వ ఎడిజె కోర్టు జడ్జి ఎన్. పద్మావతి గురువారం తీర్పు వెల్లడించినట్లు జామి ఎస్ఐ జి.వీరబాబు తెలిపారు. ఆయన మాట్లాడిన కేసు వివరాలు... జామి ఎస్‌సి కాలనీలో నివాసం ఉంటున్న శంబంగి మంగను తన భర్త వెంకటరామ్ ప్రసాద్ అనుమానిస్తూ శారీరకంగా వేధించేవాడు. ఆమెను హత్య చేయాలనే ఉద్దేశ్యంతో ఆమె నిద్రిస్తున్న ఇంటికి నిప్పు పెట్టి కాల్చి వేసినట్లు, మంగ ఫిర్యాదు చేశారు. నేరారోపణ రుజువు కావడంతో నిందితుడుకు హత్యాయత్నం 307 ఐపిసి కింద శిక్ష విధించారని ఎస్ఐ తెలిపారు.

అనుమతుల్లేని నిర్మాణాలపై కఠిన చర్యలు

బొబ్బిలి: మున్సిపల్ అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో గురువారం పారిశుధ్య పనులు, ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కుళాయి పనులు ప్రారంభం

డెంకాడ: మండల కేంద్రంలో ఇంటింటికి తాగునీరు కుళాయి పనులను పిఎసిఎస్ ఛైర్మన్ దొంగలి కనక సింహాచలం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంకాడ గ్రామంలో రూ.79 లక్షలతో ఇంటింటికి తాగునీటిని అందించేందుకు కుళాయి ఏర్పాటు చేస్తున్నామన్నారు. రెల్లి వీధిలో రూ.16 లక్షలతోనూ, డెంకాడ మధుర గ్రామమైన దొడ్డుబాడవ గ్రామంలో రూ.19 లక్షలతోనూ పనులు చేపడుతున్నామన్నారు. డిసెంబర్ నాటికి ఇంటింటికి తాగునీరు అందిస్తామన్నారు. పూర్తయిన పనులను స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ద్వారా ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పతివాడ గౌరి, నాయకులు గోపాలకృష్ణ, పలువురు వార్డు మెంబర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న దొంగలి కనకసింహాచలం

కంది పప్పు అక్రమాల్లో.. ఎండియు ఆపరేటర్లే సూత్రధారులు?

- లబ్దిదారులకు ఇవ్వని కంది పప్పు
- బ్లాక్ మార్కెట్‌కు తరలింపు

ప్రజాశక్తి– బొబ్బిలి

మున్సిపాలిటీలో కందిపప్పు అక్రమాల్లో ఎండియు ఆపరేటర్లే సూత్రదాలు అని విమర్శలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైసు కార్డుదారునికి కిలో కంది పప్పు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుని రేషన్ షాపులకు పంపిణీ చేసింది. 35,993 రైసు కార్డులకు 35,993 కిలోల కందిపప్పు సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ 9వేల కిలోల కందిపప్పు మాత్రమే పంపిణీ చేశారు. దీనిలో మున్సిపాలిటీకు ఐదు వేల కిలోలు, రూరల్‌కు 4వేల కిలోల కందిపప్పు సరఫరా చేశారు. ప్రభుత్వం సంపూర్ణంగా కందిపప్పు సరఫరా చేయకపోవడంతో కొంతమంది ఎండియు ఆపరేటర్లు కందిపప్పును బ్లాక్ మార్కెట్ తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

అరకొర కందిపప్పు సరఫరాతో అక్రమాలు

ప్రభుత్వం అరకొర కందిపప్పు సరఫరా చేయడంతో ఎండియు ఆపరేటర్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. పూర్తి స్థాయిలో కందిపప్పు సరఫరా చేస్తే ఎవరికి ఇవ్వకపోయినా అక్రమాలు బయటపడే అవకాశం ఉంది. అరకొర సరఫరా చేయడంతో చాలా మంది అపరేటర్లు లబ్ధిదారులకు కంది పప్పు ఇవ్వడం లేదు. కంది పప్పు అందని లబ్ధిదారులు ప్రశ్నిస్తే పూర్తి స్థాయిలో ప్రభుత్వం సరఫరా చేయలేదని షాక్‌గా చూపి 5 నుంచి 10శాతం సరఫరా చేసి మిగిలిన కందిపప్పు బ్లాక్ మార్కెట్‌కు తరలించి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. మల్లమ్మపేట, టిఆర్ కాలనీ, గాంధీ బొమ్మ రోడ్డు, గొల్లపల్లి తదితర ప్రాంతాల్లో రైసు కార్డుదారులకు కందిపప్పు సక్రమంగా పంపిణీ చేయకుండా అమ్ముకుని సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.



ప్రభుత్వం సరఫరా చేయాల్సిన కంది పప్పు..

కందిపప్పు అక్రమాలపై చర్యలు

కందిపప్పు అక్రమాలకు పాల్పడిన ఎండియు అపరేటర్లపై చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల ఉప తహశీల్దార్ సాయికృష్ణ చెప్పారు. ఇప్పటికే ఇద్దరిపై చర్యలు తీసుకునేందుకు జేసీకు సిఫార్స్ చేశామన్నారు. కందిపప్పు సరఫరాపై సమగ్ర దర్యాప్తు చేసి అక్రమాలకు పాల్పడినట్టు నిర్ధారణయితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కందిపప్పును మింగేస్తున్నారు..

పట్టణంలోని చాలా వార్డులు, రూరల్ ప్రాంతంలోని అధిక శాతం గ్రామాలలో టన్నుల కొద్దీ కందిపప్పును రేషన్ వాహనాల నుంచి దొంగిలించి పెద్ద పెద్ద కిరాణా దుకాణాల వద్దకు తీసుకెళ్లి కొంత మంది మింగేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి అన్నారు. ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ ఈ పందికొక్కులను ఎందుకు కట్టడి చెయ్యడం లేదో సమాధానం చెప్పాలని జనసేన పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ పంది కొక్కుల స్వైరవిహారం కేవలం బొబ్బిలికి మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్రమంతా ఉన్నప్పటికీ, ప్రభుత్వం, పౌరసరఫరాల శాఖ నిద్రపోతున్నట్లు నటించడం గర్హనీయమన్నారు.

కందిపప్పు అక్రమాలపై చర్యలు తీసుకోండి

కందిపప్పు అక్రమాలపై చర్యలు తీసుకోవాలని పిసిసి సభ్యులు ముప్పల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలో కందిపప్పు పంపిణీపై పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి పంపిణీపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు కందిపప్పు పంపిణీ చేయకుండా వ్యాపారులకు అమ్ముకోవడం అన్యాయమన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, లబ్ధిదారులందరికి అన్ని రకాల నిత్యావసర సరుకులను రేషన్ షాపులు ద్వారా పంపిణీ చేయాలని కోరారు.

అంగన్‌వాడీ సమ్మెకు మద్దతివ్వాలి

ప్రజాశక్తి– బొబ్బిలి

ఈ నెల 8 నుంచి జరగనున్న అంగన్వాడీల సమ్మెకు గర్భిణులు, బాలింతలు మద్దతు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు కోరారు. రావువారివీధిలో గురువారం అంగన్వాడీల సమ్మెకు మద్దతు ఇవ్వాలని గర్భిణులు, బాలింతలు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేసి అంగన్వాడీ కేంద్రాలను మూసి వేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయన్నారు. అంగన్వాడీల సమ్మెకు మద్దతివ్వాలని కోరారు. అంగన్వాడీలకు అండగా ఉంటా మని గర్భిణులు, బాలింతలు, మహిళలు అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రామభద్రపురం : డిసెంబర్ 8 నుండి అంగనవాడిల సమ్మె కు తమ మద్దతు ఉంటుందని రామభద్రపురం పూడి వీధి లబ్ధిదారులు తెలిపారు. అంగన్వాడి 5,6,8 సెంటర్ల లబ్ధిదారులకు అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం కరపత్రాలు పంచారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పిల్లల అభివృద్ధి పథకానికి (ఐసిడిఎస్) తగిన నిధులు కేటాయించడం లేదన్నారు. రకరకాల పథకాల పేర్లతో మభ్యపెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులను సరఫరా చేయడం లేదన్నారు. గర్భిణులు, బాలింతల ముఖాలను ఫోన్లో గుర్తించిన తర్వాతనే పోషకాహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం షరతు విధించిందని దీంతో మహిళలు, అంగన్‌వాడీ ఉద్యోగులు సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 8 నుండి జరిగే సమ్మెకు మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు పి. నారాయణమ్మ, కె. కుమారి, పి. చిన్నమ్ములు, జి ఉమా, పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి– కొత్తవలస



నిరసన ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ డిమాండ్ చేసింది. పట్టణ కాలుష్యాన్ని నివారించాలని కోరుతూ గురువారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో కొత్తవలస జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి, అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయడమే కాకుండా ఎస్ఎఫ్ఐ సామాజికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా పోరాటం చేస్తుందన్నారు. కొత్తవలస ప్రాంతంలో తరచూ ప్రయాణిస్తున్న విద్యార్థులు, వివిధ తరగతుల ప్రజలు దుమ్ము, ధూళితో ఇబ్బంది పడుతున్నారని దీనివల్ల అనారోగ్యానికి గురవుతున్నారని, మరోపక్క ఇదే ప్రాంతంలో ఉన్న పాలకులు రోజూ ఇదే రోడ్డులో, పట్టణంలో తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. అధికారులకు ఎంత చెప్పినా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్నారు. కంటకాపల్లి, గోత్రా కంపెనీ నుంచి వస్తున్న లారీలు మితిమీరి సరుకు ఎక్కించి ప్రధానంగా కాలుష్యం పెంచుతున్నాయన్నారు. కాలుష్యానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాయుడు, చైతన్య, తేజ, గణేష్, భరత్, విక్రమ్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

కొంతమంది కార్మికులనే తీసుకుంటే ఊరుకోం

- సిపి పరిశ్రమ వద్ద కార్మికుల నిరసన
- పోలీసుల రాకతో నిలుపుదల

ప్రజాశక్తి – పూసపాటిరేగ

కొంత మంది కార్మికులను పనిలోకి తీసుకొని కొంత మందిని వదిలేస్తామంటే ఊరుకునేది లేదని మైలాన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు నల్ల అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని సిపి ఆక్వా పరిశ్రమలో ఈ ఏడాది సెప్టెంబర్‌లో కార్మికులు, యాజమాన్యం మధ్ద స్వల్ప వాగ్వివాదం పరిశ్రమ లాకవుట్‌కు దారితీసింది. ఈ నెపథ్యంలో యాజమాన్యం లాకవుట్ ప్రకటించడమే కాకుండా పరిశ్రమలో ఎనిమిది మంది కాంట్రాక్టర్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అక్రమ లాకవుట్ ఎత్తివేయాలని కార్మికులు పలుమార్లు జిల్లా, మండల అధికార్లను కోరారు. దాంతో పాటు జెసిఎల్, డిసిఎల్ వద్ద పలుమార్లు సమావేశాలు జరిగాయి. పరిశ్రమలో సుమారుగా 450 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారందరికి సరిపడే పని పరిశ్రమలో లేదని యాజమాన్యం డిసిఎల్‌కు తెలిపింది. అయితే ప్రస్తుతం ఆరుగురు కాంట్రాక్టర్లును పునరుద్దరించి, సుమారుగా 400 మందిని పనిలోకి తీసుకుంటామని తెలిపింది. దానికి కార్మికపక్ష నాయకుడు నల్ల అప్పలరాజు, కార్మికులు అంగీకరించలేదు. అందరిని ఒకేసారి పనిలోకి తీసుకోవాలని, లేని పక్షంలో 48 మంది కార్మికులను విడతల వారీగా పనిలోకి తీసుకుంటామని యజామాన్యం హామీ ఇవ్వాలని కోరారు. ఈ అంశాలపై డిసెంబర్ 4వ తేదిన మరో సారి జెసిఎల్ వద్ద చర్చలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం కొంత మంది కార్మికులను పనిలోకి తీసుకున్నారు. దాంతో కార్మికులంతా పరిశ్రమ వద్దకు చేరుకొని చర్చలు ఉంటుండగా ఇలా మధ్యలో కార్మికులను ఎందుకు తీసుకుంటున్నారంటూ నిరసన వ్యక్తం చేశారు. పరిశ్రమవద్దకు భోగాపురం సిఐ ఎబి వెంకటేశ్వర్రావు, పూసపాటిరేగ ఎస్ఐ బాలకృష్ణ చేరుకొని కార్మికులతో చర్చించి సమస్య అడిగి తెలుసుకున్నారు. అనంతరం యాజామాన్యంతో చర్చించి ప్రస్తుతం 400 మంది కార్మికులును పనిలోకి తీసుకుంటామని మిగిలిన 48 మందిని అవసరాన్ని బట్టి తీసుకుంటామని యాజామాన్యం చెప్పినట్లు సిఐ తెలిపారు. దానికి కార్మికులు నిరాకరించారు. కార్మికులు, కాంట్రాక్టర్లతో మేము సమావేశం ఏర్పాటు చేస్తామని సిఐ చెప్పడంతో దానికి కార్మికులు అంగీకరించి శాంతించారు. రెండు రోజుల్లో కార్మికులు, కాంట్రాక్టర్లతో పోలీసులు అధ్వర్యంలో జరిగే చర్చలు అనంతరం తమ కార్యాచరణ ప్రకటిస్తామని కార్మికులు తెలిపారు. అందరినీ పనిలో తీసుకుంటే పర్వాలేదని లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.


పరిశ్రమ బయట నిరసన తెలుపుతున్న కార్మికులు

వైసిపితోనే సంక్షేమం సాధ్యం

ప్రజాశక్తి– రేగిడి

సంక్షేమ పథకాల అమలు వైసిపితోనే సాధ్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గురువారం బూరాడ గ్రామంలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలి' అనే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావలపల్లి జగన్మోహన్‌రావు, మజ్జి శ్రీనివాస్ రావు, గోవిందరావు, బంకి చంద్రశేఖర్, రెడ్డి నరసింగరావు, వావిలపల్లి శశిభూ షణరావు, వావాలపల్లి చంద్రశేఖర్, వెంకట రమణ పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని ఎన్‌కెఆర్‌పురంలో గురువారం జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ వివి చిన్న రామనాయుడు, ఎఎంసి ఛైర్‌పర్సన్ ఎం. కస్తూరి, పిఎసిఎస్ ఛైర్మన్ రామ్మూర్తి నాయుడు, సర్పంచ్ శ్రీదేవి, ఉప సర్పంచ్ పెదనాయుడు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షుడు జగ్గుబాబు, జిల్లా జోనల్ సెక్రెటరీ ఎం సత్యనారాయణ, సర్పంచులు బి రామనాయుడు, ఎం గంగరాజు, బి. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: మత్స్యకారులను అన్ని విధాలుగా ఆదుకున్నది వైసిపి ప్రభుత్వమేనని వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని ముక్కాం సచివాలయం పరిధిలో ఆంధ్రకు జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసుపల్లి రెయ్యుడు, మైలపల్లి నరసింహులు, పిడుగు రాంబాబు, సుందర హరీష్, ఇఒపిఆర్‌డి సురేష్, పాల్గొన్నారు.

11 నుంచి జిల్లా స్థాయి కళా ఉత్సవ పోటీలు

ప్రజాశక్తి – నెల్లిమర్ల

స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ కళాశాల(డైట్)లో డిసెంబరు 11 నుంచి రెండు రోజుల పాటు జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ యన్. తిరుపతి నాయుడు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేణుగోపాలపురంలో గల ప్రభుత్వ డైట్ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెలలో రెండు రోజులపాటు కళా ఉత్సవ్ పోటీలు జరుపుతున్నట్లు తెలిపారు. పోటీల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య సంస్థలకు చెందిన అన్ని రకాల పాఠశాలలు, జూనియర్ కళాశాలల 9,10,11,12వ తరగతులు చదువుతున్న విద్యార్థులు పాల్గొనడానికి అర్హులని చెప్పారు. 10 కళా రూపాలలో సాంప్రదాయ బద్ధ ఆటబొమ్మలు, ఆటలు, నాటకం (ఏక పాత్రాభినయం) విభాగాల పోటీలు వచ్చే నెల 11న, గాత్ర సంగీతం (సంప్రదాయ, జానపద), వాద్య సంగీతం (పర్కెసివ్, మెలోడిక్), నాట్యం (సంప్రదాయ అండ్ జానపద) విభాగాల పోటీలు 12న నిర్వహిస్తామన్నారు. ఒక విద్యా సంస్థ నుంచి ఒక్కొక్క కళారూపంలో ఒక బాలుడు, ఒక బాలిక మాత్రమే (విడివిడిగా) పాల్గొనాలని సూచించారు. కాగా గత సంవత్సరం జరిగిన కళాఉత్సవ్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన వారు ఈ సంవత్సరం పాల్గొనడానికి అనర్హులన్నారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు వారికి అవసరమైన సామగ్రిని వారే తెచ్చుకోవాలని, ప్రతి కళా రూపానికి 5 నిమిషాల సమయం ఇస్తామన్నారు. ఆసక్తి గలవారు డైట్ కళాశాల బోధనా సిబ్బంది పి.రవికుమార్ 7989350244, కె. సూర్యారావు–9441684360లను ఫోన్, వాట్సాప్ ద్వారా సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

డేటా కేంద్రం ప్రారంభం

డెంకాడ: విద్యార్థులను మార్కెట్‌కి సిద్ధం చేయడానికి, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో కొత్తగా అభివృద్ధి చెందుతున్న రంగాల గురించి జ్ఞానాన్ని అందించడానికి, ఎంవిజిఆర్ ఇంజనీరింగ్ కళాశాల డేటా కేంద్రాన్ని గురువారం ప్రారంభించింది. ఎంవిజిఆర్ క్యాంపస్‌లో డేటా ఇంజనీరింగ్ కొత్త అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ బ్లాక్‌ని మాన్సాస్ ఛైర్మన్ పి.అశోక్ గజపతిరాజు ప్రారంభించారు. కొత్త కోర్సులను ప్రవేశపెట్టిన కొద్ది నెలల్లోనే, ఎంవిజిఆర్ ద్వారా కొత్త డిపార్ట్‌మెంట్ భవనాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. నేటి ప్రపంచంలో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరికరాలను పర్యవేక్షించడానికి, నియంత్రించడానికి యాక్సెస్ సౌలభ్యం కోసం ప్రతిదీ ఇంటర్నెట్‌కు కనెక్ట్ చేస్తున్నారన్నారు. కొత్త డేటా ఇంజనీరింగ్ విభాగంలో వున్న, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, ఎల్‌ఓటి సైబర్ సెక్యూరిటీతో బ్లాక్ చైన్ అనే మూడు కోర్సులు, విదేశాలలో కూడా మెరుగైన కెరీర్ అవకాశాలను పొందడానికి విద్యార్థులకు చాలా సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కెవిఎల్ రాజు, మాన్సాస్ కరస్పాండెంట్ పి. సీతారామరాజు, ఎంవిజిఆర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆర్.రమేష్, ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎంసి శేఖర్, వైస్‌ప్రిన్సిపాల్, క్యాంపస్ ఇంజనీర్ డాక్టర్ పి. సుధీర్, డేటా ఇంజినీరింగ్ ఫ్యాకల్టీ, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమే ధ్యేయం


వంగర: సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని కొండచాకరపల్లి సచివాలయ పరిధి గీతానపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా గడపగడపకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సరిగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకొని బ్రోచర్ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరకూ మేలు చేస్తున్న సీఎం జగన్ మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, ఎంపిడిఒ హనుమంతు శశిభూషణరావు, వైసిపి మండల అధ్యక్షుడు కరణం సుదర్శన రావు, వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు, సర్పంచ్ నెయిగాపుల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

రామభద్రపురం: రాష్ట్రాభివృద్ధికి వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు గెలిపించి ముఖ్యమంత్రిని చేయవలసిన అవుసరం ఎంతైనా ఉందని ఆయనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టోను వివరించారు. ఇంటింటికి మంచినీటి పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం పేరుతో ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, అన్నదాత పేరుతో ప్రతి రైతుకు సంవత్సరానికి రూ. 20 వేల పెట్టుబడి సాయం చేస్తామన్నారు.

దళితులకు భూ హక్కు పత్రాలు

ప్రజాశక్తి– బొబ్బిలిరూరల్


పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఆర్‌డిఒ

దళితులు తాము సంపాదించుకున్న ప్రభుత్వ భూములకు సంపూర్ణ భుహక్కు పత్రాలను తమ ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే శంబంగి చినప్పలనాయుడు అన్నారు. గురువారం అలజంగి గ్రామంలో రెవెన్యూశాఖ నిర్వహించిన జగనన్న దళిత సంపూర్ణ భూ హక్కు పథకం పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ఎప్పుడో 35, 40 ఏళ్ల క్రితం ప్రభుత్వం ద్వారా దళితులు పొందిన డి.పట్టా భూములకు శాశ్వత హక్కు కల్పించే విధంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆలోచన చేశారన్నారు. ఇప్పుడు వీటిని దళిత మహిళా రైతులంతా అమ్ముకునేందుకు హక్కులు కల్పించామన్నారు. రైతుకు రూపాయి ఖర్చు లేకుండా రూ.1000 కోట్లతో రీ సర్వే నిర్వహించి పట్టాదారు పాసు పుస్తకాలు అందించా మన్నారు. ఆర్‌డిఒ ఏ.సాయిశ్రీ మాట్లాడుతూ దళితులు సాగు బడిలో ఉన్న భూములు 22ఏని తొలగించడంతో వారికి సంపూర్ణ హక్కులు కలిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపిపిలు, తహశీల్దార్లు, బొబ్బిలి మున్సిపల్ ఛైర్మన్, ఎఎంసి ఛైర్మన్, ఎమ్మెల్యే సోదరులు యెస్.వేణుగోపాల్ నాయుడు పాల్గొన్నారు.